ఆహ్లాదాన్ని పంచుతున్న పార్కులు

నగర శివారు మున్సిపాలిటీల్లో నివాసం ఏర్పాటు చేసుకుంటున్న వారి సంఖ్య క్రమంగా పెరుగుతోంది. పెరుగుతున్న జనాభాకనుగుణంగా రోడ్లు, వీధిదీపాలు, తాగునీరు, రవాణా సౌకర్యాలతో పాటు పార్కులు, వాకింగ్ ట్రాక్‌లు అంతే అవసరమవుతున్నాయి. దేవాలయాలు, మసీదులు, చర్చిలు, ఆటస్థలాలు, శ్మశానవాటికలు లాంటి మౌలిక సదుపాయాలను కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వాలు, స్థానిక పాలక మండలిలపై ఉంటుంది. అలాంటి అన్ని రకాల సౌకర్యాల కల్పనలో మణికొండ మున్సిపాలిటీ ముందు వరుసలో నిలుస్తోంది.



సందడిగా హుడా కాలనీ పార్కు


ఆకట్టుకున్న నెమలి కళాకృతి

- సేద తీరుతున్న ప్రజలు
- ఆటలాడుతున్న చిన్నారులు
- ఆదర్శంగా మణికొండ మున్సిపాలిటీ పార్కులు

మణికొండ: మణికొండ, పుప్పాలగూడ, నెక్నాంపూర్ గ్రామ పంచాయతీల్లో ఉన్న మూడు గ్రామ పంచాయతీలను కలిపి మణికొండ మున్సిపాలిటీగా ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. గతంలో ఎక్కువ శాతం లేఅవుట్‌లు గ్రామ పంచాయతీల నుంచి తీసుకున్నవే కావటంతో వాటిల్లో మౌలిక సదుపాయాల నిమిత్తం వదిలిన పదిశాతం స్థలాలు తరువాతి కాలంలో హారతి కర్పూరంలా కరిగిపోయాయి. అక్కడక్కడా అప్పటి హుడా ఇప్పటి హెచ్ఎండీఏ అనుమతులతో వచ్చిన కాలనీలు ఉన్నాయి. వాటిల్లో పార్కులు, మౌలిక సదుపాయాల గురించి వదలిన స్థలాలు దాదాపు పదిలంగా ఉన్నాయి. మున్సిపాలిటీ పరిధిలో ప్రస్తుత లెక్కల ప్రకారం 41 పార్కులు ఉన్నాయి. వాటన్నింటినీ దశలవారీగా నిధులను కేటాయించి సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దటంతో వాటిల్లో ప్రజలు ఉదయం, సాయంత్రం సమయాల్లో సేదతీరుతున్నారు.

అభివృద్ధి ఇలా..

మణికొండ మున్సిపాలిటీ పరిధిలో మొత్తం 41 పార్కులు ఉండగా వాటిలో ఇప్పటి వరకు రూ.8.46 కోట్లతో 20 పార్కులను అభివృద్ధి చేశారు. రూ. 6.39 కోట్లతో మరో 14 పార్కుల పనులు కొనసాగుతున్నాయి. భవిష్యత్తులో రూ.5.77 కోట్లతో మిగిలిన పార్కులను అభివృద్ధి చేయాలనే లక్ష్యంతో ప్రణాళికలను సిద్ధం చేసుకున్నారు. మున్సిపాలిటీ పరిధిలోని పార్కులను అందంగా తీర్చిదిద్దుతుండటంతో ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఉదయం, సాయంత్రం సమయాల్లో వచ్చి వాటిల్లో పిల్లలతో కలిసి సేద తీరుతున్నారు.

సౌకర్యాలివే..

అభివృద్ధి చేసిన పార్కుల్లో ప్రజలకు అవసరమైన అన్ని రకాల సౌకర్యాలను కల్పించారు. ముఖ్యంగా ఆటస్థలాలు, చిన్న పిల్లలు ఆడుకునే ఆటవస్తువులు, అందమైన లాన్‌స్కేపింగ్, మధ్యలో పార్కు థీమ్‌ను చెప్పే విగ్రహాలు, బొమ్మలను ఏర్పాటు చేశారు. వాటిల్లోకి వచ్చే ప్రజలు వాకింగ్ చేసుకునేందుకు ట్రాక్‌లు, ఓపెన్‌జిమ్‌లు, తాగునీరు, మూత్రశాలల సౌకర్యాలు, వేస్ట్ మెటీరియల్‌తో పక్షులు, జంతువులు, మిక్కీమౌస్ బొమ్మలను ఏర్పాటు చేయటంతో వచ్చిన వారిని అవి ఇట్టే ఆకర్షిస్తున్నాయి.



పార్కులను చూసేందుకు వచ్చిన పాఠశాలల చిన్నారులు


స్వాతంత్య్ర పోరాటయోధులతో ఫ్రీడం పార్కు

సౌకర్యాల కల్పనకు పెద్దపీట



మున్సిపాలిటీల్లో నివసించే ప్రజలు తాము చెల్లించే పన్నులను సరైన వాటికి ఖర్చు చేసి తమకు అన్ని రకాల సౌకర్యాలను కల్పించాలని కోరుకుంటారు. వారి ఆకాంక్షలకు అనుగుణంగా మున్సిపాలిటీల పరిధిలో పార్కులు, వాకింగ్ ట్రాక్‌లు, శ్మశానవాటికలు, క్రికెట్ స్టేడియం, నర్సరీలను అభివృద్ధి చేస్తున్నాం. రాష్ట్రంలో పెద్ద పట్టణాలలో సైతంలేని విధంగా మున్సిపాలిటీలో ఇప్పటి వరకు 20 పార్కులను అభివృద్ధి చేశాం. ప్రజలకు అవసరమైన అన్ని రకాల సౌకర్యాల కల్పనకు కృషి చేస్తున్నాం.

– కె. ఫల్గుణ్‌కుమార్, మణికొండ మున్సిపల్ కమిషనర్

ప్రజలు సేద తీరటం ఎంతో అవసరం



రోజంతా కుటుంబాల కోసం కష్టపడే ప్రజలు ఉదయం, సాయంత్రం సమయంలో కాస్త సేదతీరటం ఎంతో అవసరం. కాంక్రీట్ జంగల్‌గా మారుతున్న పట్టణాల్లో అలాంటి అవకాశం లేక ఎక్కువ మంది ఇళ్లు, టీవీలకే పరిమితం కావాల్సి వస్తోంది. మణికొండ మున్సిపాలిటీలో ఉన్న పార్కు స్థలాలన్నింటినీ అభివృద్ధి చేయాలని పాలక కమిటీ తీర్మానం చేసింది. దీనికనుగుణంగా పనులు శరవేగంగా కొనసాగుతున్నాయి. ఇప్పటికే అందుబాటులో ఉన్న పార్కులను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి.

– కె. నరేందర్‌ముదిరాజ్, చైర్మన్, మణికొండ మున్సిపాలిటీ

మణికొండ మున్సిపాలిటీ ఆదర్శం



నగరంలో సరైన సౌకర్యాలు లేకపోవటం, అనేక కారణాలతో శివారు మున్సిపాలిటీలలో స్థిర నివాసం ఏర్పాటు చేసుకునే వారి సంఖ్య గణనీయంగా పెరుగుతుంది. కాలనీలు, గేటెడ్ కమ్యూనిటీలు, జనాభా పెరుగుతుంది. వారందరికీ అవసరమైన మౌలిక సదుపాయాలను కల్పించే దిశగా మున్సిపాలిటీలు కృషి చేస్తున్నాయి. ఇప్పటికే 20 పార్కులను అభివృద్ధి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావడం, మరో 21 పార్కులను అభివృద్ధి చేసేందుకు పనులను కొన సాగించటంలో మణికొండ మున్సిపాలిటీ ఆదర్శంగా నిలుస్తుంది. అభివృద్ధి, మౌలిక సదుపాయాల కల్పనలో మణికొండ మున్సిపాలిటీని ఇతర మున్సిపాలిటీలు ఆదర్శంగా తీసుకుని పనిచేయాలి.

– ప్రకాష్‌గౌడ్, ఎమ్మెల్యే

క్లుప్తంగా...

ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి


కంటి పరీక్షలు చేయించుకుంటున్న ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్

మైలార్‌దేవ్‌పల్లి: ఉచిత వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్ అన్నారు. మైలార్‌దేవ్‌పల్లి డివిజన్‌లోని కాటేదాన్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆపద్బాంధవ సేవా సమితి, ప్రకాష్ అన్న యువసేన సంయుక్తంగా జయదేవ్ ఆసుపత్రి, వాసన్ ఐ హాస్పిటల్స్, కిమ్స్ ఆసుపత్రుల సహకారంతో ఉచిత ఆరోగ్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే హాజరై వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. ఆపద్బాంధవ సేవా సమితి సభ్యులు రవీందర్‌రెడ్డి, సురేష్‌గుప్తా, ఐలేష్ కుమార్, పాండురంగ, విఠల్, స్వరూపరాణి, బలరాం, హేమంత్, అనిల్ అడే, సిద్ధిరామ్ తదితరులున్నారు.

దేవాలయాల్లో మానసిక ప్రశాంతత


వార్షికోత్సవ పూజల్లో పాల్గొన్న మున్సిపల్ మేయర్ మహేందర్‌గౌడ్

బండ్లగూడ: దేవాలయాల్లో మానసిక ప్రశాంతత లభిస్తుందని బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ మహేందర్‌గౌడ్ అన్నారు. కార్పొరేషన్ పరిధిలోని రాధానగర్‌కాలనీలో హనుమాన్ దేవాలయం వార్షికోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ పూజల్లో కార్పొరేషన్ మేయర్ బుర్ర మహేందర్‌గౌడ్ హాజరై ప్రత్యేకపూజలు చేశారు. ఈ సందర్భంగా దేవాలయ కమిటీ సభ్యులు ఆయనను ఘనంగా సన్మానించారు.

గుంతల్.. చింతల్.. !


స్నేహితాహిల్స్‌కాలనీలో గుంతలమయంగా రోడ్లు

బండ్లగూడ: బండ్లగూడ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో బహుళ అంతస్తుల నిర్మాణాలు రోజురోజుకు పెరిగిపోతున్నాయి. ప్రజలకు మౌలిక సదుపాయాల కల్పన మాత్రం నామమాత్రంగా కూడా లేవని స్థానిక ప్రజలు వెల్లడిస్తున్నారు. బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని స్నేహితాహిల్స్ కాలనీలో రోడ్లు గుంతలమయంగా మారాయి. నగర శివారు ప్రాంతంలో ఉన్న ఈ ప్రాంతం అభివృద్ధి చెందుతుందని చెబుతున్న అధికారులు, ప్రజాప్రతినిధులకు ఈ రోడ్ల దుస్థితిని పట్టించుకోవాలని కోరుతున్నారు. దీనిపై అధికారులకు పలుసార్లు ఫిర్యాదులు చేసిన పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

బంగారం స్మగ్లర్ల పట్టివేత


పట్టుబడిన నిందితులు.. బంగారం

శంషాబాద్: కస్టమ్స్ తనిఖీలు తప్పించుకుని బంగారాన్ని అక్రమంగా బయటికి తీసుకొచ్చిన మరో ముగ్గురు స్మగ్లర్లను శంషాబాద్ జోన్ ఎస్‌ఓటీ పోలీసులు అరెస్ట్ చేశారు. ఎస్‌ఓటీ సీఐ సత్యనారాయణ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. కడప జిల్లా పొద్దుటూరు ప్రాంతానికి చెందిన షేక్ బాషా, షేక్ అబుబ్‌గారీ సాధిక్‌తో పాటు కర్నూలు జిల్లా కేంద్రం బ్యాంగిల్ స్ట్రీట్ ప్రాంతానికి చెందిన మహ్మద్ మున్నా భాషాలు సౌదీ అరేబియా నుంచి ఆదివారం సాయంత్రం శంషాబాద్ ఎయిర్‌పోర్టుకు చేరుకున్నారు. కస్టమ్స్ తనిఖీలు పూర్తి చేసుకుని బయటికి వచ్చారు. అయితే వీరు ముగ్గురు 640 గ్రాముల బంగారం అక్రమ రవాణా చేస్తున్నట్లు సమాచారం అందుకున్న ఎస్‌ఓటీ పోలీసులు ఎయిర్‌పోర్టు పార్కింగ్ ఏరియాలో అదుపులో తీసుకున్నారు. నిందితుల నుంచి బంగారంతో పాటు 3 లక్షల నగదును స్వాధీనం చేసుకున్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పిల్లలను ఒత్తిడికి గురి చేయొద్దు

హైదరాబాద్ క్రైమ్స్ డీసీపీ శిల్పవల్లి

గచ్చిబౌలి: మార్కులు, ర్యాంకులంటూ పిల్లలను ఒత్తిడి గురి చేయొద్దని హైదరాబాద్ క్రైమ్స్ డీసీపీ శిల్పవలి సూచించారు. ఆదివారం కొత్తగూడలోని బొటానికల్ గార్డెన్‌లో రోష్నీ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ప్రపంచ ఆత్మహత్యల నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకొని 'సే నో టు సూసైడ్' ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. తాను చేవెళ్లలో పని చేస్తున్న సమయంలో ఎక్కువగా రైతు ఆత్మహత్యల ఘటనలు చోటు చేసుకునేవని, వ్యవసాయంలో వచ్చే నష్టాలే కారణంగా గుర్తించామన్నారు. స్వచ్ఛంద సంస్థల సహకారంతో పాఠశాలలతో పాటు రైతులనూ చైతన్య పరిచే కార్యక్రమాలు నిర్వహించామని ఈ సందర్భంగా ఆమె గుర్తు చేశారు. తల్లిదండ్రులు స్నేహపూర్వకంగా పిల్లలతో మాట్లాడినప్పుడే వారి సమస్యలు గుర్తించేందుకు వీలుంటుందన్నారు. భావోద్వేగానికి గురయ్యే వారికి రోష్నీ సంస్థ కౌన్సెలింగ్ ద్వారా ఓదార్పు, మనోధైర్యం ఇస్తుందన్నారు. టీఎస్ఎఫ్‌డీసీ వైస్ చైర్మన్, ఎండీ. డాక్టర్ చంద్రశేఖర్ రెడ్డి మాట్లాడుతూ.. ఆత్మహత్యలపై సమాజాన్ని చైతన్య పరిచేందుకు మరిన్ని అవగాహన కార్యక్రమాలు నిర్వహించాల్సిన అవసరం ఉందన్నారు. ఇటీవల మా స్నేహితుడి కుమారుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడని, బాధను ఎవరికి చెప్పుకోవాలో అర్థంకాక ఆ కుటుంబం మనోవేదనకు గురవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో రోష్నీ సంస్థ డైరెక్టర్ స్వర్ణ, ప్రతినిధులు రత్న, విద్య పాల్గొన్నారు.

రైల్వే అండర్ పాస్ ముంపుపై ప్రజావాజ్యం

గచ్చిబౌలి: శేరిలింగంపల్లి రైల్వే అండర్ పాస్ ముంపు ప్రాంతాలపై నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ సౌత్ జోన్ బెంచ్‌లో ప్రజావాజ్యం దాఖలు చేశామని గజ్జెల యోగానంద్ ఫౌండేషన్ ట్రస్టీ గజ్జెల యోగానంద్ తెలిపారు. ఆదివారం గచ్చిబౌలిలోని రాడిసన్ హోటల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన వివరాలను వెల్లడించారు. గోపీ చెరువు, చాకలి చెరువు ఫుల్ ట్యాంక్ లెవల్‌లో ఆక్రమణలు ఉండటంతో వరద రైల్వే అండర్ బ్రిడ్జి వైపు వస్తుండటంతో పరిసర ప్రాంతాల రోడ్లు, నివాసితులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్‌లో ఆక్రమ నిర్మాణాలు జరుగుతున్నా అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదన్నారు. నాలుగు వారాల్లో నివేదికను సమర్పించాలని జీహెచ్ఎంసీ నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ సౌత్ జోన్ ఆదేశించిందని ఆయన తెలిపారు.

రాజీతో కేసులు పరిష్కారం

న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో లోక్ అదాలత్


కేసులను పరిష్కరిస్తున్న న్యాయమూర్తులు

రాజేంద్రనగర్: రాజీమార్గం ద్వారా కేసులను పరిష్కరించుకోవాలని మండల న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, 11వ అదనపు న్యాయమూర్తి నీలిమ అన్నారు. రాజేంద్రనగర్‌లో జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. మొత్తం 12,410 కేసులను పరిష్కరించారు. రాజీపడిన కేసులు 256, అడ్మిషన్ కేసులు 284, డ్రంకెన్ డ్రైవ్ కేసులు 4,621, ఈ–పెట్టి కేసులు 7,240, డీవీసీ కేసులు–1, బ్యాంక్ లోన్ కేసులు–3లను పరిష్కరించారు. 12వ అదనపు న్యాయమూర్తి రాజ్‌కిరణ్, 13వ న్యాయమూర్తి అంకిత్, స్పెషల్ కోర్టు న్యాయమూర్తులు రవికుమార్, నజీరుద్దీన్, ఏసీసీ గంగాధర్, ఏపీపీలు శీనయ్య, ప్రవీణానాయక్, సంగీత, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు హరిప్రసాద్‌రెడ్డి, కార్యదర్శి రామకృష్ణారెడ్డి, లోక్ అదాలత్ సభ్యులు వెంకట్‌రెడ్డి, సుదర్శన్, సుధాకర్‌రెడ్డి, సుజాత, ప్రవీణ్‌కుమార్, వరప్రసాద్, కోర్టు సిబ్బంది వెంకటరంగారెడ్డి, భాస్కర్, నరేష్‌గౌడ్, వివిధ ఠాణాల ఎస్‌హెచ్‌ఓలు, సిబ్బంది, బార్ అసోసియేషన్ సభ్యులు తదితరులున్నారు.

పండగలను శాంతియుతంగా నిర్వహించుకోవాలి

గోల్కొండ: పండగలను శాంతియుతంగా నిర్వహించుకోవాలని గోల్కొండ జోన్ ఏసీపీ సయ్యద్ ఫయాజ్ అన్నారు. రానున్న వినాయక చవితి, మిలాద్ ఉన్ నబీ పండగల ఏర్పాట్లపై ఆదివారం గోల్కొండ పోలీస్‌స్టేషన్‌లో పీస్ అండ్ మైత్రి కమిటీ సభ్యుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..మండపాల నిర్వాహకులు, మిలాద్ నబీ వేడుకల కమిటీల వారు తమతమ కార్యక్రమాల వివరాలను పోలీసులకు ముందుగానే ఇవ్వాలని ఆయన సూచించారు. గోల్కొండ ఇన్‌స్పెక్టర్ ఎస్.వెంకటేశ్వర్లు, పీస్ అండ్ వెల్ఫేర్ కమిటీ అధ్యక్షుడు ఎస్.రాజువస్తాద్, హబీద్, ఇలియాస్ అక్బర్, షానవాజ్‌ఖాన్ తదితరులున్నారు.

బీజేపీ నేతల పర్యటన

అత్తాపూర్: ప్రజా సమస్యలను తెలుసుకుని వాటికి శాశ్వత పరిష్కారం చూపిస్తున్నామని బీజేపీ చేవెళ్ల పార్లమెంట్ కన్వీనర్ నారగూడెం మల్లారెడ్డి అన్నారు. అత్తాపూర్ డివిజన్ పాండురంగానగర్ కాలనీలో స్థానిక నాయకులు, అధికారులతో కలిసి ఆయన పర్యటించారు. గత కొంతకాలంగా కురుస్తున్న వర్షాలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని బస్తీ మహిళలు కన్నీరు పెట్టుకున్నారు. చిన్నపాటి వర్షం కురిసినా.. డ్రైనేజీలు పొంగి ఇళ్లల్లోకి వరద వచ్చి చేరుతోందని, బయటికెళ్తే ఎక్కడ గుంతలున్నాయోనని ఆందోళన చెందుతున్నారు. వచ్చే వినాయక చవితి పండుగను దృష్టిలో ఉంచుకుని గుంతలమయమైన రోడ్లకు కనీసం ప్యాచ్ వర్క్స్ చేయించాలని కోరారు. ఈ సందర్భంగా మల్లారెడ్డి మాట్లాడుతూ.. గత కొద్ది రోజులుగా కురుస్తున్న వర్షాలకు డ్రైనేజీ, రోడ్లు పూర్తిగా దెబ్బతిన్నాయన్నారు. అత్తాపూర్ డివిజన్ బీజేపీ అధ్యక్షుడు సాబాద విజయ్‌కుమార్, జలమండలి సూపర్‌వైజర్ చెన్నయ్య, రాజుపైల్వాన్, సాయియాదవ్, ఉమభాయ్, లఖన్ గైక్వాడ్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.


డ్రైనేజీ పనులను పరిశీలిస్తున్న నారగూడెం మల్లారెడ్డి

వైభవంగా సీతారాముల కల్యాణోత్సవం


స్వామివారి కల్యాణోత్సవంలో రాష్ట్ర ఎన్నికల కమిషనర్ పార్థసారథి

శంషాబాద్ రూరల్ : మండలంలోని నర్కూడ శివారులోని అమ్మపల్లి (సీతారామచంద్రస్వామి) ఆలయంలో ఆదివారం మాస కల్యాణం వైభవంగా జరిగింది. స్వామివారి కల్యాణోత్సవానికి రాష్ట్ర ఎన్నికల కమిషనర్ సి.పార్థసారథి దంపతులు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. పునర్వసు నక్షత్రం సందర్భంగా ఇక్కడ ప్రతినెలా స్వామివారి కల్యాణం నిర్వహిస్తుంటారు. ఆలయ సంప్రదాయం ప్రకారం ఆయనకు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ఆయన కుటుంబసభ్యులతో కలిసి స్వామి వారికి పట్టువస్త్రాలు సమర్పించారు. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు అధికసంఖ్యలో కల్యాణానికి హాజరయ్యారు.

బీజేపీ టికెట్‌కు దరఖాస్తులు


దరఖాస్తు చేసుకుంటున్న కార్పొరేటర్ మొంద్ర సంగీతాగౌరీశంకర్


దరఖాస్తు చేసుకున్న బీజేవైఎం రాష్ట్ర ఉపాధ్యక్షుడు బైతి శ్రీధర్

అత్తాపూర్: బీజేపీ రాజేంద్రనగర్ నియోజకవర్గం ఎమ్మెల్యే అభ్యర్థిగా టికెట్ కేటాయించాలని అత్తాపూర్ డివిజన్ బీజేపీ కార్పొరేటర్ మొంద్ర సంగీతాగౌరీశంకర్ రాష్ట్ర బీజేపీ కార్యాలయంలో దరఖాస్తు చేసుకున్నారు. ఈ మేరకు తన కార్యాలయంలో ఆమె మాట్లాడుతూ.. అత్తాపూర్ డివిజన్‌లో నెలకొన్న ప్రతి సమస్యను పరిష్కరించామన్నారు. ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాల కల్పనే ధ్యేయంగా అహర్నిశలు పనిచేస్తున్నామన్నారు. గతంలో ఎన్నడూ జరగని అభివృద్ధి తాను కార్పొరేటర్‌గా గెలిచి సాధించానన్నారు. నియోజకవర్గంలో బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థిగా అవకాశమిస్తే పార్టీ నాయకులు, కార్యకర్తల సహకారంతో విజయం సాధిస్తానన్నారు.

శంషాబాద్: నియోజకవర్గ బీజేపీ అభ్యర్థిత్వానికి బీజేవైఎం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఆ పార్టీ రాష్ట్ర కార్యాలయంలో ఆదివారం దరఖాస్తు చేసుకున్నారు. ఏబీవీపీ నాయకుడిగా ప్రస్థానం ప్రారంభించిన ఆయన గతంలో తొండుపల్లి ప్రాదేశిక నియోజకవర్గం నుంచి బీజేపీ నుంచి ఎంపీటీసీ అభ్యర్థిగా విజయం సాధించారు. ప్రస్తుతం బీజేవైఎంలో రాష్ట్రస్థాయి పదవిలో ఉన్నారు. తన అభ్యర్థిత్వాన్ని ఖరారు చేస్తే బీజేపీ జెండా ఎగురవేయడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు.

పోరాట యోధురాలు చాకలి ఐలమ్మ

రాజేంద్రనగర్ జోన్ పరిధిలో చాకలి ఐలమ్మ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. ఆమె 38వ వర్ధంతి సందర్భంగా ఆదివారం ఘనంగా నివాళులర్పించారు. భూమి కోసం , భుక్తి కోసం, వెట్టిచాకిరి విముక్తి కోసం పోరాడిన వీర వనిత చాకలి ఐలమ్మ అని, అలాంటి యోధురాలిని ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకుని అన్యాయాలు, అక్రమాలపై పోరాటం చేయాలన్నారు.

– రాజేంద్రనగర్ జోన్ బృందం


శివాజీ చౌరస్తాలో నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్


నార్సింగిలో నివాళులర్పిస్తున్న వైస్ చైర్మన్, కౌన్సిలర్లు


శంషాబాద్‌లో ఐలమ్మ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న నేతలు


బుద్వేల్‌లో..


గగన్‌పహాడ్‌లో కార్పొరేటర్ తోకల శ్రీనివాస్‌రెడ్డి